# శృంగారవీథి

## సంప్రదాయ సాహిత్యంలో
## మూడో పురుషార్థం



## నూర్గురు కన్యలు

మంజు శ్రీ

దేవతలలో వాయుదేవుడు మహాబలవంతుడు . సమస్త సృష్టి జాలానికి ప్రాణదాత. ప్రాణరక్షకుడు. దేవతలలో ఆయనంత అసంగుడు మరొక రెవరూ లేరు. అంటే దేనిపట్లా ఆయనకు కాంక్షలేదు. మమత లేదు. దేనినీ అంటి పెట్టుకొని ఉండే గుణంకాదు ఆయనది. ఆయనలే ని ప్రదేశమంటూ ఉండనే ఉండదు. 'అసంగో వాయువచ్చరేత్' అంటే వాయువు అంత నిస్సంగత్వాన్ని సాధించాలి యోగి కావలనుకుం టే అని అర్థం. ప్రాణాయామం అంటే వాయుదేవుణ్ణి అర్చించి స్వాధీనం చేసుకోవడమే.

వాయువుకు రూపంలేదు. సర్వలోకాశ్ర యు డాయన. అటువంటి వాయుదేవుడికి స్త్రీ పుం సంయోగ కాంక్షకలగడం ఆశ్చర్యమే.

అంజనాదేవి కుంజరుడనే వానర శ్రేష్ఠుడి కూతురు. ఆమెను తండ్రి కేసరి అనే వానర యూథపతికిచ్చి పెళ్ళి చేశాడు. ఆయన నివాస స్థానం మాల్యవంతం. వాళ్ళింతో అన్యోన్యంగా మాల్యవంతంలో కాపురం చేస్తున్నారు.

ఒకసారి శంబసాదనుడనే రాక్షసుడు చెలరేగి ఋషులను బాధించసాగాడు. అప్పుడా మునులు శంబసాదనుణ్ణి సంహరించాల్సిందిగా కేసరిని ప్రార్థించారు. శంబసాదనుణ్ణి చావగొట్టటానికి కేసరి గోకర్ణ క్షేత్రానికి వెళ్ళాడు.

అంజనాదేవి పూర్వజన్మలో పుంజికస్థల అనే దివ్యాప్సరస. ఆమె శాప వశాన కుంజరుడికి జన్మించింది. ఆమె కామ రూపిణి. అంటే తాసుకోరిన రూపం ధరించగల దివ్యశక్తి సంపన్ను రాలు. ఒకరోజున ఆమె దివ్యమైన మానవ కాంతగా దివ్యాభరణాలు ధరించి కళ్ళు మిరుమిట్లు గొలిపే పట్టువస్త్రాలు ధరించి అపురూపమైన యౌవన విలాసంతో మాల్యవంతంపైన విహరిస్తు న్నది. కొండ కొమ్మున ఆనందంగా క్రీడిస్తున్నది. ఆ కొండశిఖరం నల్లని మబ్బైతే ఆ మేఘం చెంగట మెరుపులాగా వెలిగి పోతున్నదామె.

ఆమె నావిధంగా చూసిన వాయుదేవుడు మోహితుడైనాడు. పట్టరాని తమకంతో ఎర్రని అంచుతో మెరిసే పచ్చని పట్టుచీర తనకేమీ ఆటంకం కలిగించకుండా ఆమె సర్వస్వాన్ని ఆక్రమించుకున్నాడు వాయుదేవుడు. ఆమెను అణువణువునా పరిష్వంగం చేసుకున్నాడు. అతడు అరూపుడాయె. ఆమెకు తెలిసిపోతున్నది తనవెవ రో కౌగలించుకొంటున్నట్లు. కాని రూపం కనపడదు. ఆమె భయపడి పోయి ఎవరిలాగ అధర్మానికొడిగడుతున్నారని గద్దించి అడిగింది. అప్పుడు వాయుదేవుడు ప్రసన్నమనస్కుతతోనేను నీకు అపకారం చెయ్యను. నా మనస్సు నీ యందులగ్నమైంది. నీకు మహాబలవంతుడైన సుతుడు జన్మిస్తాడు అని చెప్పాడు. అట్లా ఆమెకు జన్మించిన కుమారుడే ఆంజనేయుడు.

వాయుదేవుడింకొక సారి కామ మోహితుడైన సన్నివేశం రామాయణంలోవుంది. కుశనాభుడనే రాజు తనయలు నూరుగురు ఉద్యానవనంలో విహరిస్తుండగా వాళ్ళను మోహించి తనను వివాహం చేసుకోవల్సిందిగా వాయుదేవుడుకోరా డు. అందుకు వాళ్ళునిరాకరించి తమ తండ్రి ఎవరికి చ్చిపెళ్ళి చేస్తే వారినే చేసుకుంటాముకాని స్వతంత్రులంకామని చెప్పారు. అందుకు వాయుదే వుడు కోపగించుకొని వాళ్ళను వికారరూపిణులుగా చేశాడు. కుశనాభుడు తన కూతుళ్ళను కాంపిల్య నగర ప్రభువైన బ్రహ్మదత్తుడికిచ్చి పెళ్ళి చేయగా తప శ్శాలి అయిన బ్రహ్మదత్తుడి స్పర్శవల్ల ఆ నూర్గురు కన్యలు మళ్ళీ సుందర రూపులైనారు.